భారీ వర్షం.. అంతా జలమయం


కథలాపూర్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల రోడ్డు


కొండ్రికర్లలో వాగు ఉధృతికి కొట్టుకుపోయిన తాత్కాలికంగా వేసిన రోడ్డు


ఒబులాపూర్ శివారులోని బాదనకుర్తి వంతెన వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి నది

కథలాపూర్: జిల్లాలో గురువారం భారీ వర్షం కురిసింది. రోడ్లన్నీ జలమయమయ్యాయి. పలు గ్రామాలకు రాకపోకలకు నిలిచిపోయాయి. కథలాపూర్‌లో మోడల్ స్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లే రోడ్డుపై వర్షపు నీరు ఉధృతంగా పారడంతో అటువైపు వెళ్లేవారు ఇబ్బందులపాలయ్యారు. ఇప్పపెల్లి–పోతారం గ్రామాల మధ్య ఒర్రె ఉధృతంగా పారడంతో 2 గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. అంబారిపేట–తుర్తి గ్రామాల మధ్య వాగు ఉధృతంగా పారడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఆయా గ్రామాల్లో తహసీల్దార్ వినోద్, ఎస్సై నవీన్‌కుమార్ పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు.

మెట్‌పల్లి రూరల్: బుధ, గురువారాల్లో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. పలుచోట్ల రాకపోకలు నిలిచిపోయాయి. రంగారావుపేట పెద్ద చెరువు మత్తడి దూకుతుండడంతో దిగువన ఉన్న ఒర్రె ప్రవాహం పెరిగింది. దీంతో అల్లూరి సీతారామరాజు తండా (ఏఎస్ఆర్‌తండా) శివారులోని కల్వర్టుపై నుంచి వరద నీరు ప్రవహిస్తోంది. ఫలితంగా ఏఎస్ఆర్‌తండా వద్ద రాకపోకలు నిలిచిపోయాయి. ఆత్మకూర్ పెద్ద వాగులో నీటి ఉధృతి ఎక్కువగా ఉంది. కొండ్రికర్ల వాగు ప్రవాహం పెరగడంతో అవతలి వైపు గ్రామాలకు వెళ్లేందుకు రాకపోకలు నిలిచాయి. పెద్దాపూర్‌లో వాగు ఉధృతికి వైకుంఠధామంలో నీరు చేరింది.

మల్లాపూర్: మండల కేంద్రంతోపాటు అన్ని గ్రామాల్లో అల్పపీడనం ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తున్నాయి. వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో చెరువులు, కుంటలు పూర్తిగా నిండిపోయి మత్తడిపై నుంచి దూకుతున్నాయి. గోదావరి నది, పెద్ద వాగులు ప్రమాదకరంగా పొంగి పొర్లుతున్నాయి. మంగళవారం మండలవ్యాప్తంగా 8.58 సెం.మీ.ల వర్షం కురిసిందని ఏఎస్‌వో శ్రీనివాస్ తెలిపారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు గోదావరి నది, పెద్ద వాగు ఉధృతంగా ప్రవహించడంతోపాటు చెరువులు, కుంటలు నిండి ప్రమాదకరంగా మారడంతో.. తహసీల్దార్ రమేశ్‌గౌడ్, ఎస్సై రాజు, ఎంపీడీవో శశికుమార్‌రెడ్డి, ఎంపీవో జగదీశ్ రెవెన్యూ, పోలీస్, పంచాయతీ సిబ్బందితో కలిసి పరిశీలించారు. గొర్రెపల్లిలో గండి పడ్డ కొత్త చెరువు నుంచి వరద నీరు నిర్మల్–జగిత్యాల జాతీయ రహదారిపై ఉధృతంగా ప్రవహించడంతో సుమారు 2 గంటలపాటు రాకపోకలు నిలిచిపోయాయి. పంట పొలాలు నీటమునిగి రైతులకు తీరని నష్టాన్ని మిగిల్చాయి. ఎస్సారెస్పీ ప్రాజెక్టు 39 గేట్లు ఎత్తి 2.56లక్షల క్యూసెక్కుల నీటిని కిందికి విడుదల చేయడంతో.. గోదావరి నదిలో వరద ప్రవాహం ఉధృతంగా ఉంది.

మల్లాపూర్ మండల కేంద్రంలో రోడ్లన్నీ జలమయమయ్యాయి. మల్లాపూర్ శివారులోని మోడల్ స్కూల్ రోడ్డు కోతకు గురై పూర్తిగా నీటమునగడంతో గ్రామస్తులతోపాటు కళాశాల అధ్యాపకులు నడవడానికి కూడా స్థలం లేకుండా ఇబ్బందిగా మారింది.

నష్టపోయిన ప్రజలు, రైతులు అధైర్యపడొద్దని, ప్రభుత్వపరంగా అండగా నిలుస్తామని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎలాల జలపతిరెడ్డి అన్నారు. మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో పర్యటించి నష్టపోయిన పంటలు, దెబ్బతిన్న రోడ్లు, గండి పడ్డ చెరువులను పరిశీలించారు. మాజీ ఎంపీపీ నల్ల రాజన్న, మాజీ సర్పంచ్ ఎండీ జమాల్, కాంగ్రెస్ నాయకులు రోండ్ల రాజరెడ్డి, మాట్ల సోమయ్య తదితరులు పాల్గొన్నారు.


మల్లాపూర్‌లో నీటమునిగిన మోడల్ స్కూల్ రోడ్డు


కొట్టుకుపోయిన యామపూర్-ఫకీర్‌కొండాపూర్ తాత్కాలిక రోడ్డు

ఇబ్రహీంపట్నం: యామపూర్, ఫకీర్‌కొండాపూర్ రోడ్డు వద్ద బ్రిడ్జి నిర్మాణ పనులు ఆగిపోవడంతో.. భారీ వర్షాలకు పక్కనే వేసిన తాత్కాలిక రోడ్డు కొట్టుకుపోయి 2 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

ఎర్దండి గోదావరి వద్ద గురువారం దేవాలయాలను చుట్టుముట్టి గోదావరి ప్రవహిస్తోంది.


మద్దులపల్లిలో తెగిన కల్వర్టును పరిశీలిస్తున్న అధికారులు

పెగడపల్లి: మండలంలో బుధవారం రాత్రి నుంచి గురువారం మధ్యాహ్నం వరకు కుండపోతగా వర్షం కురిసింది. మండలంలో 60.2ఎంఎం వర్షపాతం నమోదైంది. మండలంలోని చిన్న నీటి వనరులు నిండి మత్తళ్లు దూకుతున్నాయి. ఏడుమోటలపల్లి శివారులో వరి పైర్లు నీటమునిగాయి. మద్దులపల్లి గ్రామ శివారులోని వాగు వద్ద కల్వర్టు తెగిపోయి పంట పొలాలకు రాకపోకలు నిలిచిపోయాయి. తహసీల్దార్ రవీందర్, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సై కిరణ్‌కుమార్ గ్రామాల్లో పర్యటించారు.

సారంగాపూర్: మండల కేంద్రానికి చెందిన గొల్లపల్లి హన్మండ్లు–సూరమ్మ వృద్ధ దంపతుల ఇంట్లోకి గురువారం భారీ వరద రావడంతో.. ఇంట్లోని నిత్యావసర వస్తువులు కొట్టుకుపోయాయి. గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ గుర్రాల రాజేందర్‌రెడ్డి నిత్యావసర వస్తువులతోపాటు నగదు అందించారు. తహసీల్దార్ వాహిదొద్దీన్, ఎంపీడీవో గంగాధర్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆదుకుంటామన్నారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో రక్షణ చర్యలు


కోటిలింగాలలో గోదావరిని పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత

వెల్గటూర్: భారీ వర్షాలకు మండలంలోని కోటిలింగాల వద్ద గోదావరి పోటెత్తింది. అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత, ఆర్డీవో మధుసూదన్ పర్యటించి వరద ప్రభావిత ప్రాంతాల్లో రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. స్తంభంపల్లి పెద్ద చెరువు తూము కుడి వైపు బుంగ పడడంతో మంత్రి ఆదేశాల మేరకు ఆర్డీవో మధుసూదన్ దగ్గరుండి యువకుల సహకారంతో ఇసుకబస్తాలతో నింపేశారు. తహసీల్దార్ శేఖర్, ఎంపీడీవో కృపాకర్, సీఐ రాంనర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్ మురళి తదితరులు పాల్గొన్నారు.

మరో 2 రోజులు అప్రమత్తంగా ఉండాలి

మల్లాపూర్: భారీ వర్షాల నేపథ్యంలో 2 రోజులపాటు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. వాల్గొండ శివారులోని శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద గోదావరి నది ఉధృతిని పరిశీలించారు. ముంపు ప్రాంతాల్లో సహాయ కార్యక్రమాలు, రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. పశువులకాపర్లు మేతకు గోదావరివైపు వెళ్లవద్దని సూచించారు. ఆర్డీవో శ్రీనివాస్, డీపీవో మధుసూదన్, ఎంపీడీవో శశికుమార్‌రెడ్డి, ఎంపీవో జగదీశ్, తహసీల్దార్ రమేశ్‌గౌడ్, సీఐ అనిల్‌కుమార్, ఎస్సై రాజు, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎలాల జలపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై భారీగా వరద


జేసీబీతో నీటిని తొలగిస్తున్న పోలీసులు

జగిత్యాలక్రైం: జగిత్యాల అర్బన్ మండలం హస్నాబాద్ శివారులో జాతీయ రహదారిపై వరదనీరు భారీగా చేరింది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. డీఎస్పీ రఘుచందర్, పట్టణ సీఐ కరుణాకర్, ఎస్సైలు కుమారస్వామి, సుప్రియ, ట్రాఫిక్ ఎస్సై మల్లేశ్ జేసీబీ సహాయంతో కాలువ తీయించి నీరు వాగులోకి వెళ్లేలా పనులు చేపట్టారు.

మత్తడి దూకుతున్న చింతకుంట చెరువు



జగిత్యాల: భారీ వర్షం కురవడంతో జిల్లాకేంద్రంలోని చింతకుంట చెరువు మత్తడి దూకుతోంది. కాలనీవాసులు మత్తడిని చూసేందుకు చెరువు సమీపానికి చేరుకున్నారు. ఆహ్లాదంగా గడిపారు.

క్లుప్తంగా

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

సారంగాపూర్: మండలంలోని లచ్చక్కపేటకు చెందిన తోట మహేశ్(37) చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. ఎస్సై గీత కథనం ప్రకారం.. మహేశ్ టైల్స్ వేసే పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈనెల 23న అతిగా మద్యం సేవించి పురుగుల మందు తాగాడు. కుటుంబసభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. తిరిగి జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చి చికిత్స అందిస్తున్నారు. వైద్యులు ప్రయత్నించినా ఫలితం కనిపించలేదు. మహేశ్‌కు ఇద్దరు కుమారులు సంతానం. మహేశ్ భార్య రజిత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జీపీ ఓటర్ల జాబితా పరిశీలన


ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయంలో ఓటర్ల జాబితా పరిశీలిస్తున్న డీపీవో మదన్‌మోహన్

ఇబ్రహీంపట్నం: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండలంలోని ఆయా గ్రామాల వార్డులవారీగా ఓటర్ల, పోలింగ్ కేంద్రాల జాబితాలను ప్రదర్శించగా.. జిల్లా పంచాయతీ అధికారి మదన్‌మోహన్ పరిశీలించారు. కోమటికొండాపూర్, ఎర్దండి గ్రామాల్లో గోదావరిని పరిశీలించి గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా శానిటేషన్ పనులను చేపట్టాలని సిబ్బందికి సూచించారు. ఎంపీడీవో ఎండీ సలీమ్, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మయ్య, కంప్యూటర్ ఆపరేటర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్, అర్బన్ మండలాల్లోని పంచాయతీల్లో ఓటర్ల జాబితా ప్రదర్శించారు.

కోరుట్ల రూరల్: మండలంలోని 15 గ్రామాల్లో 31,243 మంది ఓటర్లున్నారు. ఓటరు జాబితాను ఆయా గ్రామాల్లోని నోటీసు బోర్డులపై ప్రదర్శించారు.

పెగడపల్లి: మండలంలోని 23 పంచాయతీల పరిధిలోని వార్డులవారీగా ఓటరు జాబితా ముసాయిదాను కార్యాలయాల్లో ప్రదర్శించారు.

కొడిమ్యాల: మండల పరిషత్ కార్యాలయం, పంచాయతీల్లో ఓటరు, పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితా ప్రదర్శించారు. ఎంపీడీవో స్వరూపరెడ్డి మాట్లాడుతూ.. ఏమైనా అభ్యంతరాలుంటే లిఖితపూర్వకంగా తెలపాలన్నారు.

రాయికల్: మండలంలోని 32 గ్రామాల ముసాయిదా ఓటరు జాబితాను మండల పరిషత్ కార్యాలయంలో నోటీసు బోర్డుపై ఎంపీడీవో చిరంజీవి ప్రదర్శించారు.

సారంగాపూర్: బీర్‌పూర్ మండలంలోని అన్ని పంచాయతీల్లో ఓటర్ల జాబితాను వార్డులవారీగా ఎంపీడీవో భీమేశ్ ప్రదర్శించారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

జగిత్యాలక్రైం: జగిత్యాలలోని కరీంనగర్ రోడ్‌లో గల పెట్రోల్ బంక్ వద్ద గుర్తుతెలియని మృతదేహాన్ని బుధవారం పట్టణ పోలీసులు గుర్తించారు. పెట్రోల్‌బంక్ పక్కనున్న ఖాళీస్థలంలో మృతదేహం ఉండగా.. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు అక్కడకు చేరుకున్నారు. మృతదేహాన్ని జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి ఒంటిపై నీలి నలుపు నారింజ రంగు చొక్కా, నలుపు రంగు పాయింట్ ధరించి ఉందని, ఆచూకీ తెలిసిన వారు సంప్రదించాలని పట్టణ సీఐ కరుణాకర్ తెలిపారు.

పిచ్చికుక్కల దాడిలో ముగ్గురికి గాయాలు

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం రంగసాగర్ గ్రామంలో పిచ్చికుక్కలు దాడి చేయడంతో ముగ్గురు వ్యక్తులకు గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన బానవత్ అజయ్, నారపాక రాజయ్యతోపాటు గ్రామంలో నెల రోజులుగా మతిస్థిమితం లేని గుర్తుతెలియని వ్యక్తిపై దాడి చేశాయి. గ్రామస్తులు 108లో జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.


కోరుట్లలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్


వెల్గటూర్: కౌండిన్య యూత్ మట్టి వినాయకుడి వద్ద పూజలు చేసిన ఎస్సై ఉమాసాగర్


కథలాపూర్: ఇప్పపెల్లిలో పూజలు చేస్తున్న భక్తులు

బోలో గణేశ్ మహారాజ్‌కీ.. జై..

ప్రథమ పూజలందుకునే గణనాథుడు బుధవారం వాడవాడన కొలువుదీరాడు. భక్తులు వాహనాల్లో డప్పుచప్పుళ్ల మధ్య వినాయకున్ని తీసుకొచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఎక్కడ చూసినా పండుగ వాతావరణం కనిపించింది. బొజ్జ గణపయ్యను చూస్తూ చిన్నారులు మండపాల్లో సందడి చేస్తూ కేరింతలు కొట్టారు. 9 రోజులు పూజల అనంతరం నిమజ్జనం చేయనున్నారు.

– సాక్షి నెట్‌వర్క్


మల్యాలలో త్రిశూల్ యూత్ ఆధ్వర్యంలో..


ఇబ్రహీంపట్నంలో గురేటి రెడ్డి సంఘం ఆధ్వర్యంలో..


మల్లాపూర్‌లో ఫ్రెండ్స్ క్లబ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..


మెట్‌పల్లి: మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న క్లబ్ సభ్యులు


పెగడపల్లిలో వినాయకుడి వద్ద భక్తుల పూజలు


సెల్ఫీ విత్ మట్టి గణపతికి స్పందన

వినాయక చవితి సందర్భంగా సాక్షి 'సెల్ఫీ విత్ మట్టి గణపతి'కి స్పందన లభించింది. పలువురు మట్టి గణపయ్యలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. మట్టి వినాయకులతో సెల్ఫీ దిగి భక్తిభావం చాటుకున్నారు. ప్రతీ ఒక్కరు మట్టి విగ్రహాలను పూజించాలని చాటి చెప్పారు.


వై.రామారావు, కోరుట్ల


కటుకం సురేందర్, కోరుట్ల


జుంబర్తి శ్రీకృతి, సిరికొండ, కథలాపూర్


ఆర్.మోహిత్‌కుమార్, జగిత్యాల


గోనెల మహేశ్, కోరుట్ల


ర్యాగళ్ల కౌశిక్‌కుమార్, మెట్‌పల్లి


శ్రావణ్‌కుమార్, సాగర్, మెట్‌పల్లి


కస్తూరి రాజన్న, లత, కోరుట్ల


పెనుకుల అశ్విత్, అన్విత్, వీవీరావుపేట, మల్లాపూర్


నీలం సిద్ధార్థ్ అభిమన్యు, ధృతిక పరిణతి, కప్పారావుపేట, వెల్గటూర్


విష్ణువర్ధన్ రాజు, కావ్య, చిట్టాపూర్, మల్లాపూర్


వనం దిలీప్, రాయికల్


గాంధారి శ్రీనివాస్, కథలాపూర్

ఎమ్మెల్యేకు అభినందనలు


ఎమ్మెల్యేను అభినందిస్తున్న సత్యసాయి ట్రస్ట్ సభ్యులు

జగిత్యాల: సత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతీ స్కూల్‌లో రాగి జావ పంపిణీకి ప్రభుత్వంతో ఒప్పందం కావడానికి ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ఎంతో కృషి చేశారని, వారికి అభినందనలని ట్రస్ట్ బాధ్యుడు శ్రీకాంత్ అన్నారు. గురువారం ఎమ్మెల్యేను కలిసి అభినందనలు తెలిపారు. దశరథరెడ్డి, కొమురయ్య పాల్గొన్నారు.

2024–25 సంవత్సరానికి సంబంధించి మైనార్టీ విద్యార్థుల సన్మాన కార్యక్రమముందని, హాజరు కావాలని ముస్లిం కమిటీ నాయకులు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను కోరారు. ఎమ్మెల్యే ప్రమాదవశాత్తు గాయపడగా.. ఆయనను పరామర్శించి కార్యక్రమానికి రావాలని ఆహ్వానించారు. నాయకులు అబ్దుల్ ఖాదర్, బారీ, మంజూర్, మునిమోద్దీన్, సాజిద్, నసీం పాల్గొన్నారు.

38 సింగిల్ విండో సీఈవోల బదిలీ

జగిత్యాలఅగ్రికల్చర్: సహకార శాఖ ఉత్తర్వుల మేరకు జిల్లాలోని 38 సింగిల్ విండో సీఈవోలు బదిలీ అయినట్లు జిల్లా సహకార అధికారి సీహెచ్.మనోజ్‌కుమార్ తెలిపారు. అల్లీపూర్ సీఈవో ఉపేందర్ ఉప్పుమడిగెకు, బండలింగాపూర్ సీఈవో శేఖర్ మెట్లచిట్టాపూర్‌కు, బీర్‌పూర్ సీఈవో తిరుపతి రాయికల్‌కు, భీమారం సీఈవో జయలక్ష్మి చిన్నమెట్‌పల్లికి, భూపతిపూర్ సీఈవో చంద్రశేఖర్ అల్లీపూర్‌కు, భూషణ్‌రావుపేట సీఈవో అరుణ్ వల్లంపల్లికి, చందోళి సీఈవో హాఫీజ్‌పాషా మేడిపల్లికి, చిన్నమెట్‌పల్లి సీఈవో సంతోష్ నంచర్లకు, ధర్మపురి సీఈవో రాజేశ్ ఇబ్రహీంపట్నంకు, గంభీర్‌పూర్ సీఈవో విజయ్‌కుమార్ భీమారానికి, ఇబ్రహీంపట్నం సీఈవో సతీష్‌కుమార్ భూషణ్‌రావుపేటకు, జగిత్యాల సీఈవో వేణు జైనాకు, జైనా సీఈవో సాగర్‌రావు సారంగాపూర్‌కు, కల్లెడ సీఈవో శేఖర్ చందోళికి, కొడిమ్యాల సీఈవో గంగాధర్ పూడూరుకు, కొల్వాయి సీఈవో రాజేందర్ భూపతిపూర్‌కు, కోరుట్ల సీఈవో బుచ్చయ్య కొల్వాయికి, మాదాపూర్ సీఈవో మహేందర్ యెకిన్‌పూర్‌కు, మల్లాపూర్ సీఈవో భూమేశ్ పెగడపల్లికి, మేడిపల్లి సీఈవో బొందయ్య బీర్‌పూర్‌కు, మెట్లచిట్టాపూర్ సీఈవో తిరుపతి బండలింగాపూర్‌కు, మెట్‌పల్లి సీఈవో ప్రవీణ్ జగిత్యాలకు, ముత్యంపేట సీఈవో రమేశ్ మెట్‌పల్లికి, నందగిరి సీఈవో రవికుమార్ తక్కళ్లపల్లికి, నూకపల్లి సీఈవో అనిల్‌కుమార్ పోతారానికి, పెగడపల్లి సీఈవో గోపాల్‌రెడ్డి మల్లాపూర్‌కు, పోరుమల్ల సీఈవో తిరుపతి కల్లెడకు, పోతారం సీఈవో గంగాధర్ నూకపల్లికి, పూడూరు సీఈవో రాజేందర్‌రెడ్డి కొడిమ్యాలకు, రాయికల్ సీఈవో రవికుమార్ పైడిమడుగుకు, సిరికొండ సీఈవో రాంప్రసాద్ కోరుట్లకు, తక్కళ్లపల్లి సీఈవో మనోజ్‌కుమార్‌ను తిమ్మాపూర్‌కు బదిలీ చేశారు.

పురుగు మందుల వాడకంపై అవగాహన


దమ్మన్నపేటలో రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

ధర్మపురి: దమ్మన్నపేట గ్రామంలో బుధవారం తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వాతావరణ ఆధారిత పురుగులు–వాటి తెగుళ్లపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ రాజేంద్రప్రసాద్ కార్యక్రమ ఉద్దేశాన్ని వివరించారు. వాతావరణ సంబంధిత, చీడ పురుగుల నివారణ, తెగుళ్లపై అవగాహన కల్పించారు. మండల వ్యవసాయ అధికారి రాజ్‌కుమార్, విస్తరణ అధికారి అజయ్ తదితరులున్నారు.

కేంద్రం నిర్లక్ష్యంతోనే యూరియా తిప్పలు

గొల్లపల్లి: రైతులకు అవసరమైన యూరియాను అందించడంలో కేంద్రం నిర్లక్ష్యం వహిస్తోందని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గంగాధర నరేశ్ అన్నారు. వానాకాలం సీజన్ ప్రారంభమై 2 నెలలు గడుస్తోందని, రైతులు యూరియా కోసం నెల రోజులుగా రోడ్లపైకి వచ్చి నిరసన తెలుపుతున్నారని తెలిపారు. బీజేపీ దుష్ప్రచారాన్ని ఖండించారు. రాష్ట్రానికి కావాల్సిన యూరియాను తెప్పించడానికి బీజేపీ ఎంపీలు కేంద్రంపై ఒత్తిడి తేవాలని ఆయన కోరారు.

పోరాట సభను విజయవంతం చేద్దాం

జగిత్యాల: పోరాట సభను విజయవంతం చేద్దామని టీజీటీజేఏసీ చైర్మన్ నాగేందర్‌రెడ్డి అన్నారు. సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహ దినంగా అన్ని కలెక్టరేట్ల ఎదుట నల్లబ్యాడ్జీలు, నల్ల దుస్తులతో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు పాల్గొనాలని కోరారు.